జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



## వరంగల్
ములుగు - మహబూబాబాద్
జనగామ - జయశంకర్ భూపాలపల్లి - హన్మకొండ

శనివారం | 28 | ఫిబ్రవరి | 2026 ◆ పేజీలు : 7

## త్రాగునీటి సరఫరా పై ప్రత్యేక దృష్టి సారించండి

- హన్మకొండ జిల్లా కలెక్టర్/ జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- ధర్మసాగర్ ఫిల్టర్ బెడ్ ను క్షేత్రస్థాయిలో సందర్శన



**ధర్మసాగర్, ఫిబ్రవరి27 (ప్రజా జ్యోతి)** వేసవి కాలం లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం బల్దియా ఇంజనీరింగ్, పబ్లిక్ హెల్త్, ఇరిగేషన్, మిషన్ భగీరథ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో ధర్మసాగర్ లో గల 60 ఎం.ఎల్.డి , 20 ఎం ఎల్ డి నీటి శుద్ధీకరణ కేంద్రాలలో పర్యటించి వరంగల్

మిగతా 2 లో...



- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్
- ధర్మసాగర్ తహసీలార్, ఎంపీడీవో కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

## అభివృద్ధి పనుల వేగవంతానికి చర్యలు చేపట్టాలి

**ధర్మసాగర్, ఫిబ్రవరి27(ప్రజాజ్యోతి)** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను మరింత వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు.శుక్రవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఆయా విభాగాలను గురించి కలెక్టర్ తహసిల్దార్ సదానందం ను అడిగి తెలుసుకున్నారు. పహాణీ పత్రాలు, కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీ తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి ఆయా విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ దశల్లో

మిగతా 2 లో...




## ఆపోజిట్ రూటులో బస్సుల ప్రయాణం

- ప్రమాదాలకు వేదికగా మారుతున్న ఎల్కతుర్తి బస్టాండ్
- బస్టాండులో ట్రాఫిక్ ఉల్లంఘన
- ఆపోజిట్ వేలో బస్సుల రాకపోకలతో ప్రజలకు ఇబ్బందులు

**ఎల్కతుర్తి ఫిబ్రవరి 27 (ప్రజా జ్యోతి)** ఎల్కతుర్తి మండల కేంద్రంలో ట్రాఫిక్ ఇబ్బందులు రోజురోజుకు పెరుగుతోంది. కరీంనగర్ నుండి ఎల్కతుర్తి బస్టాండ్ లోకి ప్రవేశించి హనుమకొండ వైపు వెళ్లే క్రమంలో కొన్ని బస్సులు నిర్దేశిత మార్గాన్ని పాటించకుండా ఆపోజిట్ వే లో వెళ్లడం జరుగుతోంది. ఈ విషయంపై బస్టాండ్ లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పలుమార్లు తెలియజేసిన బస్సు డ్రైవర్లు అదేవిధంగా నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణించడం కొనసాగిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో బస్టాండ్ చుట్టుపక్కల ఉన్న దుకాణదారులు అలాగే ఆ ప్రాంతంలో రాకపోకలు సాగించే ధర వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆపోజిట్ వే లో

మిగతా 2 లో...

## అర్హులైన ప్రతి వారికి ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు

- ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే



**ఆత్మకూరు, ఫిబ్రవరి 27 (ప్రజాజ్యోతి):** అర్హులైన ప్రతి వారికి ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేస్తామని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆత్మకూరు మండలం తిరుమలగిరి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రిబ్బన్ కట్ చేసి గృహాలను ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు స్వీట్లు తినిపించి, శాలువాలతో సన్మానించి, కుటుంబ సభ్యులతో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదల సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పర్వతగిరిలో మద్యం మాఫియా

- బెల్ట్ షాపులకు బహిరంగ ప్రోత్సాహం !
- మండలంలోని షాపులన్నీ ఒక్కటే.. ప్రత్యేక సిండికేట్ షాప్‌తో అక్రమ దందా !



**పర్వతగిరి, ఫిబ్రవరి 27 (ప్రజాజ్యోతి)** ఎమ్మార్పీకి సమాధి..బెల్ట్ షాపులకు అండ.. అధికారుల మౌనం వెనుక ముడుపుల వాసనా ? పర్వతగిరి మండలంలోని మద్యం షాపుల యజమానులు అందరూ ఒక్కటై, ప్రత్యేకంగా "సిండికేట్ షాప్" ఏర్పాటు చేసి అక్రమ దందాకు తెరలేపినట్టు తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎమ్మార్పీ ధరలను తుంగలో తొక్కి, ఇష్టారాజ్యంగా ధరలు

మిగతా 2 లో...

## ఆపోజిట్ రూటు లో బస్సుల ప్రయాణం



(మొదటి పేజీ తరువాయి...)
బస్సులు రావడం వల్ల తరచూ ట్రాఫిక్ జామ్ లు ఏర్పడే అవకాశం ఉండడంతో పాటు ప్రమాదాలకు కూడా దారి తీసే పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బస్టాండ్ పరిధిలో సరైన ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టి డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## అభివృద్ధి పనుల వేగవంతానికి చర్యలు చేపట్టాలి

(మొదటి పేజీ తరువాయి...)
పురోగతిలో ఉన్న పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, ఈజీఎస్, పాఠశాలల్లో అభివృద్ధి పనులు, తదితర వివరాలను ఎంపీడీవో అనిల్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ మండలంలో పురోగతిలో ఉన్న వివిధ అభివృద్ధి పనులను సంబంధిత శాఖల అధికారులు పూర్తిచేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అభివృద్ధి పనులను పూర్తి చేయడంలో అలసత్వం వహించొద్దని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు, కార్యాలయ ఉద్యోగులు ఉన్నారు.

## త్రాగునీటి సరఫరా పై ప్రత్యేక దృష్టి సారించండి





(మొదటి పేజీ తరువాయి...)
మహా నగరానికి మరియు హన్మకొండ జిల్లాలోని గ్రామీణ ఆవాసాలకు తాగు నీరు సరఫరా చేసే తీరును పరిశీలించి నిర్వహణ తీరును ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకొని సమర్థవంతం గా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా రా వాటర్ లభ్యత ను గురించి అధికారులను అడుగగా 7.9 టి ఎం సి ల నీరు ఎల్ ఎండి కరీంనగర్ నుండి అందుబాటులో ఉందని, సహజం గా 1 టి ఎం సి నీటి నిల్వలు అందుబాటులో ఉంటే కనీసం 3 నెలల పాటు నగర అవసరాలకు సరిపోతాయని, రిజర్వాయర్ లో గల వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్ ను పరిశీలించిన కలెక్టర్ నగర పరిధి లో పునరుద్ధరించడానికి గల అవకాశాలను పరిశీలించాలని జిడబ్ల్యుఎంసి ఇంజినీరింగ్ అధికారులను సూచించారు. ఇరిగేషన్ ఫేజ్ 3 లో భాగం గా దేవాదుల నుండి ధర్మసాగర్ వచ్చే నీటి సరఫరా తీరును పరిశీలించి అక్కడి నుండి చేరే నీటి పరిమాణాన్ని అడిగి తెలుసుకున్నారు. నగరంలో గల ఫిల్టర్ బెడ్ లలో తాగునీటి సామర్థ్యం, రోజు పంపింగ్ అవుతున్న నీటి పరిమాణం, శుద్ధీకరణ జరుగుతున్న రా వాటర్ తో పాటు నీటి సరఫరా జరుగుతున్న పద్ధతి అడిగి తెలుసుకొని నీటి నాణ్యత ను నిర్ధారించే విధానాలను పరిశీలించి ల్యాబ్ లో ప్రత్యక్షం గా పర్యటించి నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. ఈ పర్యటన లో కలెక్టర్ వెంట మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ రామాంజనేయులు, ఎన్ ఐ టి మాజీ ప్రొఫెసర్ డా.పాండురంగారావు ఇరిగేషన్ ఈ ఈ మంగీ లాల్ బల్దియా ఇంజనీరింగ్ అధికారులు తదితరులు ఉన్నారు.

# పర్వతగిరిలో మద్యం మాఫియా

(మొదటి పేజీ తరువాయి...)
పెంచి విక్రయాలు సాగిస్తున్నారు. ఇదే కాదు.. అక్రమంగా నడుస్తున్న బెల్ట్ షాపులను కూడా పరోక్షంగా ప్రోత్సహిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. సిండికేట్ షాప్ నుంచి బెల్ట్ షాపులకు మద్యం సరఫరా జరుగుతోందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. చట్టవిరుద్ధంగా సాగుతున్న ఈ వ్యవహారం వల్ల బెల్ట్ షాపులు మళ్లీ ఊపందుకుని, యువతను మత్తులో ముంచుతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని అన్ని దుకాణాల్లో ఒకే రేటు ఒకే నిర్ణయం ఒకే దోపిడీ ! ఎవరైనా ప్రశ్నిస్తే "తాగాలంటే మా రేటుకే కొనాలి" అన్న అహంకార ధోరణి కనిపిస్తోంది. ఇది వ్యాపారం కాదు బహిరంగ దోపిడీ అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంత బహిరంగంగా అక్రమాలు జరుగుతున్నా, సంబంధిత శాఖల అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుండటం అనుమానాలకు తావిస్తోంది. "సిండికేట్ దందాకు ధైర్యం ఎవరు ఇస్తున్నారు? నెల నెలా ముడుపులు అందుతున్నాయా? అన్న ప్రశ్నలు ప్రజల్లో గట్టిగా వినిపిస్తున్నాయి. ధరల దోపిడీతో సామాన్య ప్రజల నడ్డి విరుగుతోంది. బెల్ట్ షాపుల ప్రోత్సాహంతో గ్రామాల్లో మత్తు మరింత పెరుగుతోందని, కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పర్వతగిరిలో ఏర్పాటు చేసిన ఈ మద్యం సిండికేట్ షాప్‌ను వెంటనే మూసివేయాలని, ఎమ్మార్పీకి మించి విక్రయిస్తున్న దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రజా ఆగ్రహం ఉవ్వెత్తున ఎగసిపడకుండా సిండికేట్ దందాను మూసివేసి వారిపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## జాతీయ రహదారిపై లారీలు నిలిపితే కఠిన చర్యలు తప్పవు

- పసర ఎస్సై తాజుద్దీన్

**గోవిందరావుపేట/ములుగు స్టాఫ్ రిపోర్టర్** ములుగు జిల్లా పసర పరిధిలో జాతీయ రహదారిపై నిలిపి ఉంచిన లారీ కారణంగా రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రహదారిపై ఆగి ఉన్న లారీని వెనుక నుండి వస్తున్న మరో లారీ ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో వెనుక లారీ డ్రైవర్ గుండెల నరేష్ (30), తండ్రి నరేష్, భువనగిరి జిల్లా రామన్నపేట మండలం దుబ్బాక గ్రామానికి చెందిన వ్యక్తి, ఎడమ కాలు విరిగింది. వెంటనే స్థానికులు మరియు పోలీసులు స్పందించి గాయపడిన డ్రైవర్‌ను ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు చికిత్స అందుతోంది. ఈ సందర్భంగా పసర ఎస్సై తాజుద్దీన్ మాట్లాడుతూ, జాతీయ రహదారిపై లారీలు, భారీ వాహనాలు అనుమతి లేకుండా నిలిపి ఉంచడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని హెచ్చరించారు. రహదారిపై వాహనాలు నిలిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రాత్రి వేళల్లో ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకోవాలని, వాహనం దెబ్బతిన్నా లేదా ఇతర కారణాల వల్ల ఆగాల్సి వచ్చినా రహదారి పక్కకు పూర్తిగా తరలించి హెచ్చరిక లైట్లు, సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. జాతీయ రహదారులపై భద్రతా నిబంధనలు కచ్చితంగా అమలు చేస్తేనే ప్రమాదాలను నివారించవచ్చని పోలీసులు తెలిపారు.

## కల్లు గీత కార్మికులకు కాటమయ్య రక్ష కిట్ల పంపిణీ



**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 27 (ప్రజాజ్యోతి) :** రాష్ట్ర ప్రభుత్వం కల్లు గీత కార్మికుల రక్షణ కోసం అందిస్తున్న కాటమయ్య రక్ష కిట్ల పంపిణీ ని శుక్రవారం వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని వికాస్ ఫార్మసీ కళాశాలలో కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిలతో కలిసి అదనపు కలెక్టర్ బెన్షాలోమ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా భువనగిరి ఎంపీ మాట్లాడుతూ శిక్షణ పొందిన ప్రతి గీత కార్మికుడు విధిగా రక్షణ కిట్లను ఉపయోగించాలన్నారు. అనంతరం జనగామ ఎమ్మెల్యే మాట్లాడుతూ కల్లు గీత కార్మికులందరూ ఈ రక్షణ కిట్లను తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. తదనంతరం 419 మంది కల్లు గీత కార్మికులకు తగు సూచనలు చేస్తూ గీత కార్మికులకు వారు కాటమయ్య రక్ష కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎన్. ఎల్. నరసింహ రావు, డీపీఈఓ అనిత, ఏబీసీడీఓ రవీందర్, కెజికెఎస్ ప్రధాన కార్యదర్శి వెంకట మల్లయ్య, ఎక్సైజ్ శాఖ సిబ్బంది, వెనుకబడిన తరగతుల శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి సర్పంచ్, గ్రామస్థుల చేయూత



**గణపురం ప్రజాజ్యోతి ఫిబ్రవరి27** గణపురం మండలంలోని వెంకటేశ్వర్ల పల్లె గ్రామానికి చెందిన కీర్తి పోశయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా గ్రామ సర్పంచ్ ముప్పిడి నాగరాజ్ ముదిరాజ్ స్పందించి, తన వంతు సాయంగా ఆ కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేశారు. సర్పంచ్ చొరవతో గ్రామస్థులు అందరూ రూ 5,000 నగదును సేకరించి బాధిత కుటుంబానికి అందజేసి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పులిగిల్ల సమ్మయ్య, గొట్టుముక్కల సారయ్య, సాదం రవి, పోలు రాజేందర్, నక్క చిన్న సోమయ్య, ముప్పిడి చిరంజీవి గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఏటూర్ నాగారం నూతన ఎస్సైగా మహేష్




**ఏటూర్ నాగారం ఫిబ్రవరి 27 ప్రజా జ్యోతి** ఏటూరునాగారం సబ్ ఇన్స్పెక్టర్ గా 2024 బ్యాచ్ చెందిన పెద్దపెల్లి జిల్లా వాస్తవ్యులు బి మహేష్. శుక్రవారం ఏటూరునాగారం సబ్ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు స్వీకరించారు. అయిన గతం లో తాడ్వాయి. మంగపేట. పోలీసు స్టేషన్ లో పి ఎస్ ఐ గా విధులు నిర్వహించారు. ములుగు వి ఆర్ నుండి విధులు నిర్వహిస్తున్న అయనకు ఏటూర్ నాగారం ఎస్ ఐ బదిలీ చేయడం తో విధులలో చేరడం జరిగింది. పలువురు స్టేషన్ సిబ్బంది నూతన ఎస్సై కి అభినందనలు తెలిపారు.

## జనగామ మున్సిపాల్ ఛైర్మన్ గా కడకంచి బాలమణి వైస్ ఛైర్మన్ గా భుస పర్వతాలు బాధ్యతలు స్వీకరణ



**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 27 (ప్రజాజ్యోతి) :** జనగామ మున్సిపాల్ ఛైర్మన్ గా కడకంచి బాలమానీ, వైస్ ఛైర్మన్ గా భుస పర్వతాలు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపాల్ భవనంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలో డ్రైనేజ్ సమస్య, జనగామ ను సుందరీకరణంగా తీర్చి దిద్దే విధంగా కృషి చేస్తానని అన్నారు. రేపటి నుండి నెలరోజుల పాటు స్పెషల్ డ్రైవ్ వార్డులలో తిరుగుతూ, సమస్యలను ఎలా పరిష్కరించాలో కౌన్సిలర్లతో చర్చించి పరిష్కరిస్తామని చెప్పారు. రోడ్లు క్లీన్ చేసే మెషిన్ మరియు ట్రాక్టర్ లను ఓపెన్ చేశారు.

# తెలంగాణ విద్యా కమిషన్ సిఫారసులు

- లోపభూయిష్టంగా, విద్యా రంగానికి ఉపాధ్యాయులకు నష్టాన్ని కలిగించేలా ఉన్నాయి
- తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ సొంత అభిప్రాయాలను విద్యా రంగం ఉపాధ్యాయులపై రుద్దడం సరికాదు
- మంచర్ల టవివీరభద్రం స్టేట్ టీచర్స్ యూనియన్ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి



**ఏటూర్ నాగారం ఫిబ్రవరి 27 ప్రజా జ్యోతి**

ఏటూరు నాగారం మండల కేంద్రంలో స్టేట్ టీచర్స్ యూనియన్ ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి మంచర్ల టవివీరభద్రం మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయుల, అధ్యాపకుల, బోధనేతర సిబ్బంది వేతనాలు మార్కెట్ ప్రమాణాల కంటే ఎక్కువగా ఉన్నాయి అని సిఫారసులు ఇవ్వడం అర్ధరహితం అని అన్నారు.తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ సొంత అభిప్రాయాలతో విద్యారంగం అభివృద్ధికి సరిపడని కొన్ని సిఫారసులు చేయడం విద్యా శాఖకు నష్టం చేకూర్చగలదని అన్నారు.ఉపాధ్యాయుల జీతాలు గౌరవప్రదంగా ఉండాలని భారత దేశ స్థాయిలో ఏర్పడిన విద్యా కమిషన్లు మరియు రాష్ట్ర ప్రభుత్వ వేతన సవరణ కమిటీలు స్పష్టంగా సిఫార్సులు చేశాయి అని గుర్తు చేశారు.వీటి ఆధారంగా ఉపాధ్యాయుల వేతనాలను కాలానుగుణంగా పెరిగిన నిత్యవసరాల కనుగుణంగా స్థిరీకరణ జరిగింది అని అన్నారు.జాతీయ విద్యా కమిషన్లు యూనివర్సిటీ ఎడ్యుకేషన్ కమిషన్. (1948–49) ఉపాధ్యాయులకు సమాజంలో గౌరవ స్థానం కల్పించాలి అని మంచి జీతం లేకపోతే నాణ్యమైన బోధన రాదు అని స్పష్టంగా తెలియజేసింది అని అన్నారు. సెకండరీ ఎడ్యుకేషన్ కమిషన్. (1952–53) ఉపాధ్యాయుల జీతాలు ఆకర్షణీయంగా ఉండాలి ప్రతిభావంతులు ఉపాధ్యాయ వృత్తి లోకి రావాలంటే సరైన వేతనం అవసరం అని సిఫారసులు చేశాయని అన్నారు . ఉపాధ్యాయుల జీతాలను పట్ల కించపరిచేలా రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసులు చేయడం సరికాదని అన్నారు.ఈ వ్యాఖ్యలు ఉపాధ్యాయుల్లో మనోవేదన కలిగించడంతో పాటు, వారి వృత్తి గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. సమాజంలో ఉపాధ్యాయులపై తప్పు సంకేతాలు వెళ్ళే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. భారతదేశంలో పలు రాష్ట్రాలతో పాటు, వివిధ దేశాలలో ఉపాధ్యాయుల వేతనాలు తెలంగాణ రాష్ట్రం కంటే ఎక్కువ ఉన్నాయని గుర్తు చేశారు. విద్యా కమిషన్ తన పరిధి దాటి, ఈ విధంగా ప్రస్తావించడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నించారు. రాష్ట్రంలోని విద్యా వ్యవస్థపై సమగ్ర అధ్యయనం చేసి పాఠశాలల పరిస్థితులు, విద్యా ప్రమాణాల పెంపు, విద్యా రంగ పురోగతిపై ప్రభుత్వానికి మంచి నివేదిక అందిస్తారని ఆశించామని, ఉపాధ్యాయుల జీతభత్యాలు, ఉపాధ్యాయ నియామక అర్హతలు, పదోన్నతులు వంటి అంశాలను ప్రతికూలంగా ప్రస్తావించడం దురదృష్టకరమని అన్నారు. వేతనాల నిర్ణయం అనేది నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల ఆధారంగా శాస్త్రీయ పద్ధతిలో "పే రివిజన్ కమిషన్" (పి. ఆర్.సి.) ల పరిధిలో ఉండే విషయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శి అడప రాజేందర్ వాంకుడోత్ రాం బాబు కన్నాయి బాధ్యులు .బాధ్యులు కందుకూరి రాజు, రాజేంద్ర ప్రసాద్ జిల్లా నాయకులు నాయుడు, విష్ణుమూర్తి, రామదాసు వెంకటేష్ ,రాజశేఖర్, రవీందర్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## వార్డుల్లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరిస్తాం

- వార్డు కౌన్సిలర్లుతో కలిసి వార్డులు పర్యటించిన
- చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్



**నర్సంపేట ఫిబ్రవరి 27 (ప్రజా జ్యోతి):** నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు కౌన్సిలరు వైస్ చైర్మన్ గంధం నరేందర్, 8వ వార్డు కౌన్సిలరు దొంగల రజిత, 23వ వార్డు కౌన్సిలరు వేల్పుల శ్రీలత గార్లతో కలిసి నేడు శుక్రవారం ఉదయం పర్యటించిన నర్సంపేట మున్సిపల్ ఛైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్, మున్సిపల్ వైస్ చైర్మన్ గంధం నరేందర్ అనంతరం ఛైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ మాట్లాడుతూ నర్సంపేట నియోజకవర్గ శాసనసభ్యులు నియోజకవర్గ అభివృద్ధి ప్రధాత పెద్దలు దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు 7వ వార్డు, 8వ వార్డు తోపాటు 23వ వార్డులో పర్యటించి వార్డుల సమస్యలను తెలుసుకుంటూ వాటిని పరిష్కరించడం జరుగుతుందన్నారు, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో వార్డుల్లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు అసంపూర్తిగా ఉన్నటువంటి మురుగునీటి కాలువలను నిర్మించి వార్డులలో ఎలాంటి సమస్య లేకుండా చూస్తామని, అదే విధంగా సీసీ రోడ్ల నిర్మాణము చేసి పారిశుధ్య సమస్య లేకుండా నిరంతరము వార్డులో మున్సిపల్ కార్మిక సిబ్బందితో పరిష్కరిస్తామని,ఎమ్మెల్యే మాధవరెడ్డి సహకారంతోటి పార్టీలకు అతీతంగా వార్డుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కాట భాస్కర్, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు మాదాసి రవి, బాణాల ప్రసన్న–శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వార్డు ఆఫీసర్లు, వార్డు జవాన్లు, మున్సిపల్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి అందరూ కలిసి పని చేయాలి

- దస్తగిరిపల్లిలో ఘనంగా పౌరహక్కుల దినోత్సవం

**నల్లబెల్లి, ఫిబ్రవరి 27(ప్రజా జ్యోతి):** మండలంలోని దస్తగిరిపల్లి గ్రామంలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ ముప్పు కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ కృష్ణ మాట్లాడుతూ. సమాజంలో ప్రతి ఒక్కరూ పౌరహక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని కోరారు. ముఖ్యంగా ఎస్సీ. ఎస్టీ అట్రాసిటీ చట్టం యొక్క ప్రాముఖ్యతను, నిబంధనలను గ్రామస్తులకు వివరించారు. గ్రామంలోని వివిధ సమస్యల పరిష్కారానికి అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, అంటరానితనం వంటి సామాజిక రుగ్మతలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ సామరస్యంగా మెదలాలని సూచించారు. గ్రామంలో డిపి షుగర్ లాంటి దీర్ఘకాలిక వ్యాధులకు టెస్టులు చేసి మందులు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామస్తులు అధికారులను నిలదీశారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పులి రమేష్ . ఎంపీడీవోశ్రీనివాస్ రావు. ఎస్సైలక్ష్మారెడ్డి . ఎంపీవో పసరగుండ రవి . ఎంఈఓ అనురాధ. ఏవో రజిత బన్న.విద్యుత్ శాఖ ఏఈ మధుకర్. ఇరిగేషన్ ఏఈ భవాని.డాక్టర్ ఆచార్య, డాక్టర్ వేణు, సుధాకర్ ఏపీఎం.ఏపీఓ, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది, గ్రామ వార్డు సభ్యులు, విలేఖరులు దస్తగిరిపల్లి గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.




## సొంత ఇంటి కల నెరవేరింది



**ఏటూర్ నాగారం ఫిబ్రవరి 27 ప్రజా జ్యోతి:** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ సహాయం వల్ల ఇల్లు కట్టుకోవడం జరిగింది అని ఏటూర్ నాగారం మండల కేంద్రం కి చెందిన వసంత.భూషణం దంపతులు కుటుంబ సభ్యులు తెలిపారు.నిరుపేదరికంతో జీవితంలో సొంతగా ఇల్లు కట్టుకుంటామని ఊహించుకోలేకపోయాము. అన్నారు.ఏటూరునాగారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల సహకారంతో,మంత్రి సీతక్క కృషి వల్ల ఇందిరమ్మ ఇల్లు లబ్ధిపొంది, నేడు గృ హప్రవేశం చేస్తున్న సందర్భంగా మా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారూ మంత్రి సీతక్క కి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని తెలియజేసారు.

## చిన్నారి హత్య ఘటనపై మండిపడ్డ ప్రజా సంఘాలు

- బాధిత కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం ,పక్కా ఇల్లు 10 లక్షల ఎక్స్గ్రేషియా అందించాలి



**నల్లబెల్లి, ఫిబ్రవరి 27 (ప్రజా జ్యోతి):** సబ్ పోస్ట్ ఆఫీస్ నల్లబెల్లి నుండి నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్‌కు చిన్నారి హత్య సంఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞాపన పత్రాన్ని పంపించారు. రెండు నెలల చిన్నారిని కాలితో తన్ని హత్య చేసిన ఘటనపై దోషులను వెంటనే గుర్తించి చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీ నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేసి కుటుంబా నికి పది లక్షల ఎక్స్గ్రేషియా, ఒకరికి ఉద్యోగం, డబుల్ బెడ్‌రూం ఇల్లు అందించాలని కోరారు.ఇలాంటి అమానుష ఘటనలు మళ్లీ జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలన్నారు. సభ్య సమాజం తల దించుకునే ఈ సంఘటనపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. అగ్రవర్ణాల పెత్తనంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలపై దాడులను తీవ్రంగా ఖండించారు.రాజ్యాంగం ఇచ్చిన జీవించే హక్కును కాలరాయడం అసహ్యం అంటూ ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బట్టు సాంబయ్య , పరికిరత్నం,కందిక రమేష్, యుగేందర్, శ్రీనివాస్, రత్నాకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ కాపీలను అందజేసిన సర్పంచ్



**కాళేశ్వరం ఫిబ్రవరి 27: (ప్రజాజ్యోతి ):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో శుక్రవారం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలు పంపిణీ చేశారు.మద్దులపల్లి గ్రామ సర్పంచ్ ఎల్వల సరిత పదిమంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు తమకు ఇళ్లు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, త్వరగా ఇండ్ల నిర్మాణ పనులను ప్రారంభిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లచ్చిరెడ్డి, వార్డు సభ్యులు, కార్యదర్శి స్వాతి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## సివిల్ సప్లైస్ డిఎంను కలిసిన రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు



**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి):**సివిల్ సప్లైస్ ములుగు జిల్లా డిఎంగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కృష్ణవేణిని సివిల్ సప్లైస్ కార్యాలయంలో శుక్రవారం ములుగు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కలిశారు.ఈ సందర్భంగా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షుడు బాదం ప్రవీణ్ పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బాదం ప్రవీణ్ మాట్లాడుతూ..జిల్లా లోని రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను డిఎం దృష్టికి తీసుకెళ్లారు.ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న మిల్లింగ్ చార్జీలు వెంటనే విడుదల చేయాలని కోరారు.దీనిపై సివిల్ సప్లైస్ డిఎం కృష్ణవేణి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అలాగే బారదాన్(గన్నీ బ్యాగుల)లెక్కలు, ధాన్యం మిల్లింగ్‌కు సంబంధించిన పరిపాలనాపరమైన సమస్యలు, చెల్లింపుల ఆలస్యం,రవాణా, నిల్వలకు సంబంధించిన ఇబ్బందులతో పాటు రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న అన్నిసమస్యలను డిఎంకు వివరించారు.రైస్ మిల్లర్స్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డీఎం కృష్ణ వేణి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ తో పాటు అసోసియేషన్ సభ్యులు,ఇతర ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ప్రజలకు న్యాయం

- పార్టీ ములుగు జిల్లా ప్రధానకార్యదర్శి విక్రాంత్





**వాజేడు, ఫిబ్రవరి 27, (ప్రజాజ్యోతి):** ములుగు జిల్లా వాజేడు మండలంలోని ఏడ్జర్లపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ మాట్లాడుతూ ఏడ్జర్లపల్లి గ్రామం అభివృద్ధిపథంలో కొనసాగాలని, అందుకు కార్యకర్తలు, నాయకులు కొత్త ఉత్సాహంతో ముందుకు సాగితే అభివృద్ధి పథంలో గ్రామం ముందుంటుందని, ప్రజాసమస్యల పరిష్కారం కోసమే కాంగ్రెస్ పార్టీ అనునిత్యం పనిచేస్తుందని, గత ప్రభుత్వంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఎలాంటి అభివృద్ధి పనులు చేయకుండా ప్రజలను ఇబ్బందికి గురిచేశారని, ప్రాంతీయ పార్టీలతో ప్రజలకు న్యాయం జరిగేదేమి లేదని, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంతోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని అన్నారు. అలాగే ఏడ్జర్లపల్లి గ్రామపంచాయతీ నూతన భవనాన్ని అసంపూర్తిగా నిర్మాణం చేపట్టి గాలికి వదిలేసారని స్థానిక నాయకులు ఆయనకు తెలపడంతో గ్రామపంచాయతీ భవనాన్ని పరిశీలించి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి మాట్లాడడంతో అధికారులు స్పందించి భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేపిస్తామని అన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బట్ట దామోదర్, ఉప సర్పంచ్ గంప నరసింహారావు, బోర శ్రీనివాసరెడ్డి, చెన్నం మోహన్ రావు, చెన్నం సరబాబు, నాంపల్లి నరసింహారావు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# అగ్రకుల ఆధిపత్యానికి అంతం లేదా..?

- ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు యాసం రమేష్



**వెంకటాపురం ఫిబ్రవరి 27 (ప్రజా జ్యోతి):**ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని ప్రభుత్వ అతిథి గృహం ఆవరణలో శుక్రవారం జరిగిన ఎంఆర్పిఎస్ కార్యకర్తల సమావేశంలో మండల అధ్యక్షుడు యాసం రమేష్ మాట్లాడుతూ..మానవత్వం మంటగలిసింది.అగ్రకులోన్మాదం అప్పుడే లోకం చూస్తున్న రెండునెలల పసికందు ప్రాణం తీసింది.నాగర్‌కర్నూల్ కుమ్మెరలో ఈనెల18న చోటుచేసుకున్న ఈ ఘటన భూస్వామ్య పోకడను,దానిలోని రక్షసత్వాన్ని తట్టిలేపింది.అయినప్పటికీ ప్రభుత్వం గానీ,అధికార యంత్రాంగం గానీ స్పందించలేదు.మాది ప్రజా ప్రభుత్వం అని చెప్పుకునే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో జరిగిన ఈ దారుణంపై ఇంతవరకు పట్టించుకోలేదు.కారణం అగ్రవర్ణ,పెత్తందారి మూలాలేనా?ఇంత వివక్ష రాజ్యమేలుతున్నా ఎవరూ ప్రశ్నించకపోవడం బాధాకరం.అదే గ్రామానికి చెందిన చంద్రకళ కొడుకు గణేష్ దళిత యువతిని కులాంతర వివాహం చేసుకున్నాడు.అతని అక్క కీర్తి మరొకరిని కులాంతర వివాహం చేసుకుంది. సామాజికంగా దళితులు,రజకులు కావటం,ఆర్థికంగా సెంటు భూమి లేకపోవడం,ఆ కుటుంబం వివక్షకు,దాడికి,చివరకు చిన్నారి హత్యకు దారితీసేవరకు వెళ్లాయి.పెత్తందారులుగా చలామణి అవుతున్న గ్రామ సర్పంచ్ తుకారం రెడ్డి ఇంటి పక్కనే ఆ కుటుంబం నివాసం ఉండేది.పలుమార్లు మీరు ఉంటున్న ఇంటి స్థలం కూడా నాదేనని ఘర్షణకు దిగిన సందర్భాలున్నాయి.దీంతో దొరలకు భయపడి ఆ కుటుంబం చాలాకాలం బయటే జీవించింది.ఇటీవల కుమ్మెరలో ప్రతి ఏడాది లాగే మల్లన్న జాతర జరగ్గా,దానికి గణేష్ అక్క కీర్తి వెళ్లింది.అక్కడే ఉన్న శ్రీనివాస్ రెడ్డి,గుడి లోపలికి వెళ్లటానికి వీల్లేదు అని హుకుం జారిచేశాడు. దీంతో మేమెందుకు వెళ్లకూడదు మేం మనుషులం కాదా?దేవుడి దగ్గరికి వెళ్లే హక్కు మాకు లేదా?దేవుడిని మేము దర్శించుకోకూడదా అని నిలదీసింది. రూ.వంద ఫీజు చెల్లించి లోపలికి వెళ్లాలని చెప్పగా చెల్లించింది. కానీ, రశీదు అడిగింది.దీంతో అగ్రహించిన రెడ్డి తక్కువ కులం దానా,దొమ్మరిదానా అని పత్రికలో రాయలేని విధంగా బూతులు తిట్టాడు.విషయం తెలుసుకున్న గణేష్ గ్రామంలో అగ్రకుల ఆధిపత్యం పెచ్చరిల్లుతుంది మహిళలని చూడకుండా దౌర్జన్యం చేశారు దీనికి కళ్లెం వేయాలి అంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు.రెచ్చిపోయిన పెత్తందారులు ఎనిమిది మంది సుమారు మూడున్నర గంటల పాటు అక్కడే గణేశుని దొరకబట్టి గదిలో కుక్కి చితకబాదారు.విడతలవారీగా దాడిచేసి తీవ్రంగా కొట్టారు.తన కొడుకును కొట్టొద్దని చంద్రకళ కాళ్లమీద పడ్డా వినలేదు.మహిళ అని చూడకుండా తన్నారు.గణేష్ భార్య మౌనిక, సోదరి కీర్తి కొట్టకండి అవసరమయితే మేము ఊరు వదిలివెళ్తాం అంటూ బతిమిలాడిన వినలేదు.పచ్చి బాలింతగా ఉన్న మౌనిక నా రెండు నెలల పసిబిడ్డను చూసైనా వదిలిపెట్టండి అని ప్రదేయపడినప్పటికీ వినకుండా ఆ పసిబిడ్డను కూడా కాలితో తన్ని ప్రాణం తీశారు.అమానవీయంగా చిన్నారిని హత్య చేసిన ఆ గ్రామ అగ్రకుల పెత్తందారులపై బాధితులు ఫిర్యాదు చేయడానికి 100కి డయల్ చేయగా పోలీసులు స్పందించలేదు.పైగా బాధితుల పక్షాన నిలవాల్సిన పోలీసులు అగ్రకులస్తులకు లొంగిపోవడం పెద్దఎత్తున చర్చకు తావిచ్చింది.రివర్స్‌లో నిందితుల ఫిర్యాదుపై స్పందించిన పోలీసులు,బాధితులు ఫిర్యాదు చేస్తే మాత్రం పట్టించుకోకపోవడం విచారకరం.దీన్నిబట్టి చట్టం ఉన్నవారికి చుట్టం వలే మారుతుందన్న మాటలకు ప్రత్యక్ష రూపం. ఈ దాడిలో ఎనిమిది మంది పాల్గొంటే ముగ్గురిని మాత్రమే అరెస్టు చేశారు.మిగతావారు ఎక్కడ వీరంతా స్థానిక ఎమ్మెల్యే బంధువులు,అనుచరులు కావడంతోనే ఈ కేసులో నుంచి వారిని తప్పిస్తున్నట్టు తెలుస్తోంది.వెంటనే దీనిపై విచారణ వేగవంతం చేసి మిగిలినవారిని కూడ అరెస్టు చేయాలి.బాధితులకు న్యాయం చేసే విధంగా ప్రభుత్వం స్పందించాలి.గ్రామంలో కులవివక్ష పునరావృతం కాకుండా అవగాహనా కార్యక్రమాలు,సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయాలి.ఇంతటితో ఈ సమస్య పరిష్కారం కాదు అంతకన్నా ముందు అగ్రకులాల ఆధిపత్యం, వారి భూస్వామ్యం నశించే విధంగా చర్యలు తీసుకోవాలి.బడిలో, గుడిలో కూడా సమానత్వంపై చర్చ చేసి అందరూ సమానమనే భావన తీసుకురావాలి.ఇది ప్రస్తుత పరిస్థితిలో చాలా అవసరం.ఎందుకంటే తెలంగాణలో ప్రత్యేకించి మత,కుల విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా కొన్ని శక్తులు ఆజ్యం పోస్తున్నాయి.దీనివల్లే అగ్రకుల ఆధిపత్యం మెజారిటీ మతోన్మాదం పెచ్చరిల్లుతున్నాయి.దాడులు, దౌర్జన్యాలు, లైంగికదాడుల వంటి హత్యలకు కారణమవుతున్నాయి.రాష్ట్రంలో సుమారు 143 కుల దురహంకార హత్యలు చోటుచేసుకున్నాయి.ఉత్తర తెలంగాణలో నిజామాబాద్,కామారెడ్డి,నిర్మల్,జగిత్యాల జిల్లాల్లో వీడీసీ ముసుగులో అట్టడుగు వర్గాలను సాంఘిక బహిష్కరణలు జరుగుతున్నాయి.దాడులు, దౌర్జన్యాలు విపరీతంగా సాగుతున్నాయి.ప్రత్యేకించి ఆరెస్సెస్,సంఘ పరివార్ పేరిట సోషల్ మీడియాల్లో ముస్లిం,క్రైస్తవ వ్యతిరేకత రెచ్చగొట్టడం,విద్వేషాలు నింపడం,దాడులకు ఉసిగొల్పడం వంటివి చేస్తున్నాయి.శివాజీ,అంబేద్కర్ విగ్రహాల పోటీపెట్టి మహనీయులకు కూడా మతం రంగు పులిమి ఘర్షణలను తీసుకొస్తున్నాయి. మేడారం జాతరలో కోవా బన్నులో కల్తీ ఉందని పేరు అడిగి తెలుసుకున్న తర్వాత ముస్లిం కావడంతో యూట్యూబ్ ఛానల్ ముసుగులో హిందుత్వ మతోన్మాదులు దౌర్జన్యానికి ఒడికట్టారు.మతసామరస్యాన్ని కోరుకునే మన సమాజం కోవాబన్ను అమ్ముకునే చిరు వ్యాపారికి బాసటగా నిలబడింది.మతోన్మాదుల ఆటలు సాగనివ్వమని ప్రకటించింది.కమ్మెర చిన్నారి విషయంలో కూడా సమాజం ఐక్యంగా నిలబడాలి.ఆ కుటుంబానికి న్యాయం జరిగే వరకూ పోరాడాలి.ఈ ఘటనపై బీజేపీ మౌనం వీడాలి.రాష్ట్ర అధ్యక్షుడు కూడా మహబూబ్‌నగర్ జిల్లా వాసే, అతను ఎందుకు స్పందించడం లేదు. ఇద్దరు కేంద్రమంత్రులు ఏం చేస్తున్నట్టు.ఇదేనా మీరు చెప్పే హిందూ ధర్మం?బాధితుల పక్షాన నిలబడతారా?అగ్రకులస్తుల పక్కన చేరతారా అన్నది దీంతో బయటపడాలి.రాష్ట్రమంతా గమనిస్తున్నది.ఇప్పటికైనా అధికార, ప్రతిపక్షాలు చిన్నారి కుటుంబానికి న్యాయం జరిగేవరకూ పోరాడాలి.కనీసం నిలువ నీడలేని వారికి ఇందిరమ్మ ఇల్లుతో పాటు రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియో ప్రకటించాలి.ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి.జాతరలో ధర్మకర్తల పేరుతో చెలరేగుతున్న అగ్రకులాల ఆధిపత్యానికి చెక్‌పెట్టాలి. వారిని ధర్మకర్తల నంచి తొలగించాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలి.లేదంటే ప్రజాఉద్యమాలతో సర్కార్ దిగొచ్చేలా చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు యాసం మహేష్ మాదిగ,చెన్నం ఎల్లయ్య మాదిగ,తిప్పనపల్లి వెంకటేష్ మాదిగ,చెన్నం గౌతం మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎమ్ఎమ్ఎస్ ఫలితాల్లో సత్తాచాటిన చిట్యాల లిఖిత్ శ్రీ హర్ష



**వెంకటాపురం,ఫిబ్రవరి 27 (ప్రజా జ్యోతి) :**జాతీయ ఆదాయ ఆధారిత ప్రతిభా స్కాలర్ షిప్ (ఎన్.ఎం.ఎం.ఎస్)ఫలితాల్లో ములుగు జిల్లా వెంకటాపురం మండలానికి చెందిన చిట్యాల లిఖిత్ శ్రీహర్ష స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి అద్భుత ప్రతిభ కనబరిచి స్కాలర్ షిప్ కు ఎంపికయ్యారు.ఈ స్కాలర్ షిప్ కు ఎంపిక అయిన చిట్యాల లిఖిత్ శ్రీహర్షను పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు పలువురు అభినందించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జివివి సత్యనారాయణ విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..లిఖిత్ శ్రీహర్ష మొదటి నుండి చదువులో ఎంతో చురుగ్గా ఉండేవారని,క్రమశిక్షణతో కూడిన కఠిన శ్రమ వల్లే ఈ విజయం సాధ్యమైందని కొనియాడారు.ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు



జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ఇలాంటి విజయాలు సాధించడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు.ఈ విజయం సాధించిన లిఖిత్ శ్రీ హర్షను,అతనికి మార్గదర్శకత్వం వహించిన ఉపాధ్యాయ బృందాన్ని,విద్యార్థి తల్లిదండ్రులను అభినందించారు.విద్యార్థి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.ఈ స్కాలర్షిప్ కు ఎంపికైన విద్యార్థికి 9వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు వరుసగా నాలుగు సంవత్సరాలు సంవత్సరానికి 12వేల చొప్పున 48వేల నగదు అందుకోనున్నట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు.ఈ కార్యక్రమంలో బి జయరాం,బి నాగమణి,సిహెచ్ఎస్ నరసింహారావు,రామకోటి,తల్లిదండ్రులు చిట్యాల చక్రి రోజా తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

- వర్ధన్నపేట ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం




**వర్ధన్నపేట, ఫిబ్రవరి 27 ప్రజా జ్యోతి** విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడంతో పాటు ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకొని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని వర్ధన్నపేట ప్రభుత్వ పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కాగితపు శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం వర్ధన్నపేట జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా, అధికారులు గా బాధ్యతలు స్వీకరించి పాఠశాల నిర్వహణ చేపట్టడం విశేషంగా నిలిచింది. ప్రధానోపాధ్యాయులుగా రామగిరి రాజేష్ ఖన్నా వ్యవహరించగా, మండల విద్యాశాఖాధికారిగా కుదురుపాక సాత్విక్, జిల్లా విద్యాశాఖాధికారిగా కొండేటి శశి కిరణ్ పాత్రలు పోషించారు.పదవ మరియు తొమ్మిదవ తరగతుల విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. విద్యార్థుల బోధనా నైపుణ్యం, ఆత్మవిశ్వాసం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, పిల్లల్లో నాయకత్వ గుణాలు, బాధ్యతాభావం పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలంటే స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకుని క్రమశిక్షణతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి న్యాయనిర్ణేతలుగా ఉపాధ్యాయులు రోహిణి దేవి, మంజు సుప్రియ, నర్సింగరావు వ్యవహరించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు రమణారావు, అశోక్, కుమారస్వామి, మనుజేందర్ రెడ్డి, మదన్ మోహన్, దేవయ్య, రజని ప్రియదర్శిని, కళ్యాణి, సునీత, వెంకన్న, జయంజలి తదితరులు పాల్గొన్నారు. స్వయం పరిపాలన దినోత్సవం విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడంతో పాటు బాధ్యతాయుత భావనను పెంచిందని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు.

# వాడబలిజ కులస్తులందరం ఐక్యంగా ఉండాలి

- వాడబలిజ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమణయ్య



**వాజేడు, ఫిబ్రవరి 27, (ప్రజాజ్యోతి):** ములుగు జిల్లా వాజేడు మండలంలోని ధర్మవరం గ్రామంలో వాడబలిజ సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గగ్గూరి రమణయ్య ఆధ్వర్యంలో 100 మందితో రమణయ్య మామిడి తోటలో వెంకటాపురం మండలంలోని బీసీ మర్రిగూడెం గ్రామం నుండి గగ్గూరి రమణయ్య మొక్కజొన్న తోటలో పనికి వచ్చిన వాడబలిజ కూలీలు, స్థానిక వాడ బలిజ కులస్తులతో శుక్రవారం సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గగ్గూరి రమణయ్య మాట్లాడుతూ వాడ బలిజ కులస్తులందరం ఇంకా అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నామని, విద్య ఎంతో ముఖ్యమైంది కాబట్టి మనమందరం మన పిల్లలకి చదువుని అందించాలని, వారికి రావాల్సిన బిసి లోన్స్ గురించి వివరించి మనమందరం ఐకమత్యంగా ఉంటేనే పోరాడగలుగుతామని, అన్ని రంగాల్లో మనం రాణించాలంటే వాడబలిజ కులస్తులందరం ఐక్యంగా ఉండాలని అన్నారు. త్వరలోనే రాష్ట్ర కమిటీతో మీ బీసీ మర్రిగూడెం గ్రామంలో మీటింగ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర యూత్ అధ్యక్షుడు బొల్లె ఆదినారాయణ, ములుగు జిల్లా ఉపాధ్యక్షుడు గార తిరుపతి, వాజేడు మండల అధ్యక్షుడు గార నాగార్జున, వాజేడు మండల ఉపాధ్యక్షుడు తోనూరు రఘుబాబు, అయ్యవారిపేట గ్రామ అధ్యక్షుడు తోట సమ్మయ్య, రాంపురం గ్రామ యువ నాయకుడు శ్రీధర్, సంఘం సభ్యులు, పాల్గొన్నారు.

# సోంత ఖర్చులతో కొత్త బోర్ ఏర్పాటు చేసిన కౌన్సిలర్ గుజ్జ వీర రాఘవరావు



**వర్ధన్నపేట, ఫిబ్రవరి 27 ప్రజా జ్యోతి:** వరంగల్ జిల్లా, వర్ధన్నపేట మున్సిపల్ పట్టణ కేంద్రంలోని 3వ డివిజన్‌లో నెలకొన్న నీటి ఎద్దడిని నివారించేందుకు స్థానిక కౌన్సిలర్ గుజ్జ వీరరాఘవ రావు స్వంత ఖర్చులతో కొత్త బోర్ తవ్వించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్ధన్నపేట పట్టణ అధ్యక్షుడు గోధుమల మధుసూదన్, 3వ డివిజన్ అధ్యక్షుడు కొండేటి సుధాకర్, పట్టణ సోషల్ మీడియా కన్వీనర్ సిలివేరు శ్రీధర్ యాదవ్, 11వ డివిజన్ అధ్యక్షుడు మైస వీరేందర్, 3వ డివిజన్ నాయకులు గబ్బేట బాబు, ఎం.డి. అలీమ్ తదితరులు పాల్గొన్నారు.స్థానిక ప్రజలు కౌన్సిలర్ చేపట్టిన చర్యను అభినందిస్తూ, నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా మరిన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ బోర్ ద్వారా పరిసర ప్రాంతాలకు తగినంత తాగునీరు అందుబాటులోకి రానుందని నాయకులు తెలిపారు.

# పెళ్లి వేడుకలో విషాదం డాబాపై నుండి జారిపడి బీటెక్ విద్యార్థికి తీవ్ర గాయాలు

**చెన్నారావుపేట ఫిబ్రవరి 27 (ప్రజా జ్యోతి ):** బంధువుల పెళ్లి వేడుకలో సందడి చేయాల్సిన ఆ యువకుడు.. ఊహించని ప్రమాదంతో ఇప్పుడు ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతున్నాడు. చెన్నారావుపేట మండల కేంద్రంలో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.అసలేం జరిగింది?పాత ముగ్దుంపురం గ్రామానికి చెందిన ననుమాస కిరణ్ కుమారుడు ననుమాస వంశీ, హైదరాబాద్‌లో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. గురువారం జరిగిన తన పెద్దనాన్న కూతురు వివాహానికి వంశీ ఊరికి వచ్చాడు. రోజంతా వేడుకల్లో ఉత్సాహంగా గడిపిన వంశీ, రాత్రి ఊరేగింపు అనంతరం చెన్నారావుపేటలోని తన పెద్దనాన్న అశోక్ అద్దె నివాసంలో నిద్రపోయాడు.శుక్రవారం తెల్లవారుజామున నిద్రలేచిన వంశీ, డాబాపై నుండి బయటకు వచ్చే క్రమంలో ప్రమాదవశాత్తు అదుపుతప్పి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతని తలకి తీవ్రమైన గాయమైంది.కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి,అపస్మారక స్థితిలోకిచేరుకున్నాడు.తెల్లవారుజామున గమనించిన స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బాధితుడిని చికిత్స నిమిత్తం హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వంశీ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. పెళ్లి ఇంట్లో జరిగిన ఈ ప్రమాదంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

# ఇఫ్తార్ విందులో పాల్గొన్న సర్పంచులు

**టేకుమట్ల ఫిబ్రవరి 27 ప్రజాజ్యోతి:** టేకుమట్ల మండలంలోని దుబ్యాల-మందలోరిపల్లిలో శుక్రవారం ముస్లిం సోదరులు ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో దుబ్యాల సర్పంచ్ సంగీ అంజలి,మందలోరీపల్లి సర్పంచ్ మారం అర్చన మాజీ ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు సంగి రవి పాల్గొని ముస్లిం సోదరులతో అలైబలై తీసుకొని ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఉపసర్పంచ్లు వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# పైప్‌లైన్ లీకేజీకి తక్షణ మరమ్మతులు





**పర్వతగిరి, ఫిబ్రవరి 27 (ప్రజాజ్యోతి):** పర్వతగిరి మండల కేంద్రంలోని గడి ముందు పైప్‌లైన్ లీకేజీ ఉందని సర్పంచ్ చీదురు శంకర్‌కు సమాచారం అందింది. దీనిపై ఆయన వెంటనే స్పందించి గ్రామపంచాయతీ సిబ్బందిని తీసుకొని సంఘటనా స్థలానికి చేరుకున్నారు. లీకేజీ కారణంగా నీటి వృథా జరుగుతున్న విషయాన్ని గమనించిన సర్పంచ్ శంకర్, స్వయంగా పనుల్లో పాల్గొని మరమ్మతు పనులు చేపట్టారు. గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి పైప్‌లైన్‌ను సరిచేసి నీటి సరఫరా పునరుద్ధరించారు. గ్రామంలో నీటి సమస్య తలెత్తకుండా తక్షణమే చర్యలు తీసుకున్న సర్పంచ్‌కు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

# ఎస్సీ యాక్షన్ ప్లాన్ సమావేశంలో పాల్గొన్న వరంగల్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు తూళ్ల రవి



**వర్ధన్నపేట ఫిబ్రవరి 27 ప్రజా జ్యోతి:** ఎస్సీ యాక్షన్ ప్లాన్ అమలుపై మాసబ్ ట్యాంక్‌లోని సంక్షేమ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వర్ధన్నపేట మండలం, కొత్తపల్లి గ్రామానికి చెందిన వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు తూళ్ల రవి పాల్గొన్నారు. ఎస్సీల అభివృద్ధి కోసం కార్యాచరణ ప్రణాళికపై విస్తృత చర్చలు జరిగాయి.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ ఎస్సీ విభాగం కోఆర్డినేటర్ ప్రీతం, ఎస్సీ సెల్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణతో పాటు వివిధ జిల్లాల ఎస్సీ విభాగాధ్యక్షులు హాజరయ్యారు. ఎస్సీ వర్గాల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి సమగ్ర యాక్షన్ ప్లాన్ రూపొందించాల్సిన అవసరాన్ని నాయకులు ప్రస్తావించారు. సమావేశం అనంతరం తుళ్ల రవి మాట్లాడుతూ, ఎస్సీల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పనిచేస్తోందన్నారు. ఎస్సీల జనాభా శాతం 15 శాతంగా ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం 30 శాతం వరకు పదవులు, ఉద్యోగాలు, పార్టీ హోదాల్లో అవకాశాలు కల్పించిందని పేర్కొన్నారు.రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నడూ లేని విధంగా నాలుగు మంత్రి పదవులు ఎస్సీ వర్గాలకు కేటాయించిందని, మాల–మాదిగ వర్గాలకు సమన్యాయం కల్పించిందని తెలిపారు. రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారైనా ముఖ్యమంత్రి ఎస్సీల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు.ఎస్సీలకు ఉన్నత స్థానాల్లో సముచిత స్థానం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, నేడు ఎస్సీలు ఉన్నత స్థానాల్లో ఉన్నారంటే దానికి కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలే కారణమని పేర్కొన్నారు. 40 సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న ఎస్సీ వర్గీకరణ అంశాన్ని అమలు చేసిన ప్రభుత్వం కూడా కాంగ్రెస్ ప్రభుత్వమేనని తుళ్ల రవి స్పష్టం చేశారు.ఎస్సీ యాక్షన్ ప్లాన్ ద్వారా ఎస్సీల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని సమావేశంలో నాయకులు అభిప్రాయపడ్డారు.

## వాగ్దేవి కళాశాలలో సేల్స్, మార్కెటింగ్ వ్యూహాలపై వర్క్ షాప్ నిర్వహణ



**వరంగల్ సిటీ, ఫిబ్రవరి 27(ప్రజాజ్యోతి):** నగరంలోని బొల్లికుంటలో గల వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ లో ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో "స్టార్టప్‌ల కోసం సమర్థవంతమైన సేల్స్ మరియు మార్కెటింగ్ వ్యూహాలు" అనే అంశంపై శుక్రవారం ఒక రోజు వర్క్‌షాప్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమం డా. దేవేందర్ రెడ్డి (సెక్రటరీ మరియు కరస్పాండెంట్), కె. ప్రకాష్ (ప్రిన్సిపల్), తిరుపతి రావు (వైస్ ప్రిన్సిపల్) వారి సహకారంతో విజయవంతంగా నిర్వహించబడింది. డా. భాస్కర్ రావు (ఎంబీఏ విభాగాధిపతి), డా. ఏ. స్వేత (ఐఐసీ కోఆర్డినేటర్), డా. వి. రామచందర్ రావు (ఐఐసీ ఫ్యాకల్టీ కోఆర్డినేటర్) లు హాజరై కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ముఖ్య అతిథిగా డా. ములకల శ్రీనివాస్ (వాగ్దేవి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్‌లో అసోసియేట్ ప్రొఫెసర్) హాజరయ్యారు. ఈ మాట్లాడుతూ బ్రాండింగ్, కస్టమర్ ఆక్విజిషన్ మరియు డిజిటల్ మార్కెటింగ్ వ్యూహాలపై స్టార్టప్‌లకు అవసరమైన ముఖ్యమైన అంశాలను వివరంగా తెలియజేశారు. సుమారు 200 మంది విద్యార్థులు మరియు అధ్యాపకులు, డా. మురళి (అసిస్టెంట్ ప్రొఫెసర్), డా. భార్గవి (అసిస్టెంట్ ప్రొఫెసర్) పాల్గొనగా వర్క్‌షాప్ ఘన విజయంగా నిలిచింది.

## మిషన్ భగీరథ లీకేజ్ సమస్యను పరిష్కరించిన ఛైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్



**నర్సంపేట ఫిబ్రవరి 27 (ప్రజా జ్యోతి):** నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు వల్లబ్ నగర్ లోని మిషన్ భగీరథ పైప్ లైన్ గత సంవత్సరాలుగా లీకేజ్ జరుగుతుండగా ఇటీవల అధికారులతో కలిసి ఆ ప్రాంతాన్ని సందర్శించిన నర్సంపేట మున్సిపాలిటీ ఛైర్ పర్సన్ శ్రీమతి పెండెం శ్రీలక్ష్మిరామానంద్ ఆ సమస్య పరిష్కారానికి చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గంధం నరేందర్ గుప్తా,స్థానిక కౌన్సిలర్ బీరం భరత్ రెడ్డి, ఏఈ కుమార స్వామి, వాటర్ ఇంచార్జ్ శ్రీనివాస్,నర్సంపేట పట్టణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పంబి వంశీకృష్ణ,నర్సంపేట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొంత రంజిత్,కాంగ్రెస్ పార్టీ నాయకులు ములుకల మనీష్,కొర్ర రాహుల్, గోక వేద ప్రకాష్,భూక్య గణేష్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కోటగుళ్లలో భూపాలపల్లి సిఐ నరేష్ కుమార్ పూజలు



**గణపురం ప్రజాజ్యోతి ఫిబ్రవరి27:** ప్రసిద్ధిగాంచిన చారిత్రక సంపద కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లలో శుక్రవారం పర్వదినం సందర్భంగా భూపాలపల్లి సిఐ దొమ్మాటి నరేష్ కుమార్ గౌడ్ గణపేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారిని సాదరంగా ఆహ్వానించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు పూజా కార్యక్రమాల అనంతరం కోట గుళ్ళు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించి ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలను అందజేశారు.

# ప్రభుత్వ టీచర్ల వేతనాలపై ఆకునూరి మురళి వాఖ్యలు అర్ధరహితం

- **టి పి టి ఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షులు యు అశోక్**



**వరంగల్ సిటీ, ఫిబ్రవరి 27 (ప్రజాజ్యోతి):** తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి తన నివేదికను ముఖ్యమంత్రికి అందజేసిన క్రమంలో మాట్లాడుతూ టీచర్లకు వేతనాలు చాలా ఎక్కువగా ఉన్నాయని మాట్లాడిన అర్థరహిత వ్యాఖ్యలను టిపిటిఎఫ్ వరంగల్ జిల్లా శాఖ తీవ్రంగా ఖండించింది. శుక్రవారం టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఊటుకూరు అశోక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి అనువైన విద్యా విధానం ఎలా ఉండాలో సిఫార్స్ చేయాలని విద్యా కమిషన్ ను నియమించారు, కానీ కమిషన్ తనకు సంబంధం లేని అంశమైన ఉపాధ్యాయుల వేతనాలు చాలా ఎక్కువగా ఉన్నాయని నివేదికలో పొందుపరుస్తూ నిన్న జరిగిన ప్రెస్ మీట్ లో కూడా మాట్లాడడం దురదృష్టకరం అన్నారు. నిజానికి మిగతా రాష్ట్రాలతో పోలిస్తే టీచర్లకు తెలంగాణలోనే తక్కువ వేతనాలు ఉన్నాయి. ఉద్యోగ ఉపాధ్యాయులకు పెంచే వేతనాలు ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి వేతన సవరణ సవరణ కమిషన్ను నియమించి ఆ కమిషన్ శాస్త్రీయంగా అధ్యయనం చేసి దేశ వ్యాప్తంగా ఉన్న ధరలు మరియు ద్రవ్యోల్బనాన్ని పరిశీలించి ఒక కుటుంబానికి నెలకు ఎంత అవసరమో శాస్త్రీయంగా అధ్యయనం చేసి వేతనాలు ఎంత పెరగాలో నివేదిక ఇస్తాయి. కానీ పాలకులు వాటిని సరిగా అమలు చేయరు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి ఇప్పటివరకు దాదాపు నాలుగు పిఆర్సిలు తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయులు నష్టపోవడం జరిగింది. న్యాయంగా ఉద్యోగ ఉపాధ్యాయులకు రావలసిన డిఏలు జిపిఎఫ్ లోన్స్, పెన్షన్ బెనిఫిట్స్ ఇవ్వకుండా గత నాలుగు సంవత్సరాలుగా తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నటువంటి ప్రభుత్వాన్ని మురళి ఎందుకు ప్రశ్నించలేదని అన్నారు. అలాగే ఉపాధ్యాయులకు సంబంధించిన అర్హతల విషయంలో కూడా ఆకునూరి మురళి అసమంజస సిఫార్సు చేసినారు. ఉపాధ్యాయులకు ఏ ఏ అర్హతలు ఉండాలో నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ నిర్ణయిస్తుంది దానికి ఈ కమిషన్కు సంబంధం లేదు. ఎన్ సీ టి ఈ నిబంధనల ప్రకారం ఒకటి నుండి 5వ తరగతి వరకు బోధించే ఉపాధ్యాయులకు ఇంటర్ మరియు డి ఈ డి, 6 నుండి 10వ తరగతి వరకు బోధించే ఉపాధ్యాయులకు డిగ్రీ మరియు బీఈడీ విద్యార్హతలను చేయడం జరిగింది. ఉపాధ్యాయుల ప్రమోషన్ల పై కూడా అసంబద్ధమైన నివేదికను ఇవ్వడం జరిగింది. ఎవరైనా ఉద్యోగంలో చేరినప్పుడు ఉద్యోగులుగాని ఉపాధ్యాయులు గాని తమ సర్వీస్ లో ఉన్నత శిఖరాలు ఎదగాలని కోరుకుంటారు. ప్రమోషన్ అనేది న్యాయంగా రావలసినటువంటి అంశం వేరే డిపార్ట్మెంట్లలో జాబ్ లో చేరిన నాలుగైదు సంవత్సరాలలో ఉన్నత స్థానానికి వెళుతుండగా స్కూల్ ఎడ్యుకేషన్ లో మాత్రం ఒక ఎస్జీటీ ఉపాధ్యాయుడు స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్ పొందడానికి 20 నుండి 30 సంవత్సరాలు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. చాలామంది ఉపాధ్యాయులు జీవితంలో ఒక్క ప్రమోషన్ తీసుకోకుండానే పదవి విరమణ చెందుతున్నారు. స్థూలంగా చూస్తే ఆకునూరి మురళి సిఫార్సులు ప్రభుత్వ విద్యను భ్రష్టు పట్టించి ప్రైవేటు విద్యకు బాటలు వేసే విధంగా ఉంది, గ్రామీణ ప్రాంతాలలోని బడుగు బలహీన వర్గాలకు విద్యను దూరం చేసే ప్రమాదం ఉంది. కాబట్టి ఆకునూరి మురళి చేసిన ఈ సిఫార్సులను నిర్ద్వందంగా తిరస్కరించాలని అవసరమైతే మేధావులతో తిరిగి విద్యా కమిషన్ వేసి నివేదిక తీసుకోవాలని టిపిటిఎఫ్ వరంగల్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది.

## అమెరికా సామ్రాజ్యవాదం భారతదేశానికి తీవ్ర హాని చేస్తుంది

- **తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జంగారెడ్డి**



**పాలకుర్తి ఫిబ్రవరి 27/ ప్రజా జ్యోతి :** కేంద్ర మోడీ ప్రభుత్వం విద్యుత్ విత్తన చట్టాలు భారత రైతంగ మనుగడకు ముప్పు చేస్తుందని చేతకానితనం వల్ల దేశ మార్కెట్ను కబలించే దుకు అమెరికా ప్రయ త్నిస్తుందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి జంగారెడ్డి, మోకు కనకా రెడ్డి అన్నారు శుక్రవారం నియోజకవర్గ కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా మూడో మహాసభలు శ్రీ సోమేశ్వర ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు.ఈ మహాసభ కు అధ్యక్ష వర్గంగా రాపర్తి సోమయ్య మాచర్ల సారయ్య రామావత్ మిట్యా నాయక్ బచ్చు శ్రీలత అధ్యక్షత వహించారు ఈ సందర్భంగా జంగారెడ్డి రాష్ట్ర ఉపా ధ్యక్షులు పాల్గొని మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం రైతాంగ ప్రయో జనాలను అమరికకు తాకట్టి పెట్టిందని విమర్శించారు. విత్తన చట్టం విషయంలో అమెరికాతో లాలూచీ పడటం సిగ్గుచేటు అన్నారు. ప్రపంచా న్ని ట్రంప్ బెదిస్తున్నాడని, భారత్పై ఆంక్షలు విధిస్తున్నాడని, అమెరికా ఉత్పత్తులను ఇక్కడ అడ్డుకున్నందుకు 25% జరిమాన వేశాడని, మనం అక్కడ వస్తువులు అమ్ముకోవాలంటే మరో 25% సుంకాల విధిస్తున్నాడని తెలిపారు. రష్యా వద్ద పెట్రోల్ కొనకుండా బెదిరిస్తున్నాడని, ఈ దుర్మార్గపు విధానాలకు మోడీ ప్రభుత్వం తల వంచిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం అదాని అంబానీలకు మేలు చేయడం కోసం కేంద్రం అమరికకు దాసోహమైందని అన్నారు. ట్రంపు సుంకాలను 18 శాతానికి తగ్గించారని కానీ గతంలో ఇది కేవలం మూడు శాతం ఉండేదని అన్నారు. అమెరికా ధాన్యం పాలు కూరగాయలు భారత మార్కెట్లోకి వస్తే మన దేశ రైతుల పరిస్థితి ఏంటి అని ప్రశ్నించారు, 150 ఏళ్లుగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోట్లు తెచ్చారని ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చి పేదల కూలీల పుట్ట కొడుతున్నారని విమర్శిం చారు, రాముని పేరుతో ప్రజలను మభ్యపెడుతూ భజన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సవరణ బిల్లు ద్వారా ఉచిత విద్యుత్తును రద్దుచేసి రైతాంగాన్ని దెబ్బతీస్తు న్నారని, అను విద్యుత్తు రంగాన్ని ప్రైవేటు పరం చేయడం దేశానికి ప్రమాదకరమని హెచ్చరించారు.పాలకుర్తి చెన్నూరు రిజర్వాయర్లను వెంటనే పూర్తి చేసి రైతాంగానికి నీరు అందించా లని గతంలో పలుమార్లు ఆందోళన చేసినప్పటికీ ప్రభుత్వం హడావిడి చేసింది తప్ప రిజర్వాయర్లను పూర్తి చేయడంలో విఫలమ య్యారని వెంటనే రిజర్వా యర్ పనులను పూర్తి చేసి రైతాంగానికి నీరు అందించా లని లేనియెడల రైతు సంఘం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యచందు నాయక్. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సింగారపు రమేష్, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎదునూరి మదర్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్యాల సోమన్న, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సోమ సత్యం, రైతు సంఘం నాయకులు బెల్లంకొండ వెంకటేష్, నక్క యాకయ్య, పయ్యావుల బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి దశలోనే క్రమశిక్షణ అలవర్చుకోవాలి

- **హసన్ పర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ చేరాలు**

**హసన్ పర్తి,ఫిబ్రవరి–27(ప్రజాజ్యోతి):** హసన్ పర్తి మండల కేంద్రంలోని సెంట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హసన్ పర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ వట్టే చేరాలు మాట్లాడుతూ, విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని క్రమశిక్షణతో నిరంతరం శ్రమిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు.పదవ తరగతి పరీక్షలకు హాజరవడం విద్యార్థుల జీవితంలో తొలి మెట్టును దాటినట్టేనని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తాను ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే క్రమం తప్పని కృషి అవసరమని సూచించారు. విజయానికి చిట్కాలు ఉండవని, చిట్కాల ద్వారా వచ్చిన ఫలితాలు జీవిత లక్ష్యాలను నెరవేర్చవని స్పష్టం చేశారు. పాఠశాల ముప్పై రెండు సంవత్సరాలుగా విద్యార్థులను తీర్చిదిద్దుతూ అనేక మందిని ఉన్నత స్థానాలకు చేర్చడం అభినందనీయమని కొనియాడారు.విద్యార్థులు రహదారి ప్రమాదాలకు గురికాకుండా భద్రతా నియమాలు పాటించాలని, మోసాలకు పాల్పడే నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ అంశాలపై తమ తల్లిదండ్రులు, బంధువులు, పరిసర ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినీ విద్యార్థులకు చేరాలు పతకాలు అందజేశారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుమలేశ్వర్ రెడ్డి, నిర్వాహకులు వెంకటేశ్వర్లు, సదానందం, కల్పనారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.





# గ్రామ అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించాలి

- ఎంపీడీవో వనపర్తి అద్వైత
- ముగిసిన వార్డు మెంబర్ శిక్షణ శిబిరం



**ఖానాపురం /ఫిబ్రవరి 27(ప్రజా జ్యోతి)** ఖానాపురం మండలం లోని పలు గ్రామపంచాయతీల వార్డు సభ్యులకు రెండవ దశ శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. మండలంలోని 10 గ్రామపంచాయతీ లలో 90 మంది వార్డు సభ్యులకు 19 విభాగాల్లో శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వనపర్తి అద్వైత మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ అభివృద్ధిలో వార్డ్ సభ్యుల పాత్ర అత్యంత కీలకమన్నారు. తమ వార్డు పరిధిలో మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్యం మొదలగు అంశాలలో ప్రత్యేక చొరవ చూపాలన్నారు. దేశానికి పట్టుకొమ్మలైన గ్రామాల రూపురేఖలు మారినప్పుడే నిజమైన దేశ అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరూ తమ గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయాలన్నారు.

# కర్రే స్వామికి నివాళులు అర్పించిన సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాస్ రావు



**ఎల్కతుర్తి ఫిబ్రవరి 27 (ప్రజా జ్యోతి)** కర్రె స్వామి భౌతిక కాయాన్ని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాస్ రావు సందర్శించి నివాళులు అర్పించారు. శుక్రవారం ఎల్కతుర్తి మండలం గోపాల్పూర్ గ్రామానికి చెందిన కర్రే స్వామి (55) అనారోగ్యంతో మరణించారు. ఈ సందర్భంగా కర్రే స్వామి భౌతిక దేహంపై సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కల్లపల్లి శ్రీనివాస్ రావు పూలమాలవేసి నివాళులర్పిస్తూ సంతాపం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఎల్కతుర్తి మండలం గోపాల్పూర్ గ్రామంలో ఎర్ర స్వామి అనారోగ్యంతో అమరత్వం పొందడం బాధాకరమని కర్రె స్వామి కష్టనష్టాల్ని ఎదుర్కొని మంచితనంతో కలుపుకోలు తనంతో ఎంతో మంచి పేరు తెచ్చుకోవడం జరిగిందని అన్నారు. కర్రె స్వామి మరణం ఆ కుటుంబానికి సమాజానికి తీరని లోటని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రే బిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శి సభ్యులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్,డెన్ ఎ. స్టాలిన్, గ్రామ ఉపసర్పంచ్ మారుపాక అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# వెంకటాపూర్ లో వైభవంగా పెద్దమ్మ తల్లి బోనాలు



**దామెర, ఫిబ్రవరి 27 (ప్రజాజ్యోతి):** దామెర మండలం వెంకటాపూర్ లో పెద్దమ్మ తల్లి బోనాల పండుగ వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ సంఘం సభ్యులందరూ కొత్త దుస్తులను ధరించి బంధుమిత్రులు కుటుంబ సభ్యులు ఆనందంతో కొబ్బరికాయలు కొట్టి, పసుపు, కుంకుమలు, నైవేద్యం అమ్మవారికి సమర్పించారు. సాంప్రదాయం, ఆచారం ప్రకారం, డప్పు చప్పుళ్ల మధ్య మొక్కులను చెల్లించారు. గ్రామ ప్రజలు సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించేలా చూడాలని అమ్మవారికి మొక్కులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పంచగిరి రాజు, ఉప సర్పంచ్ గోల్కొండ రమేష్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బుస సారంగం, ఉపాధ్యక్షుడు గోల్కొండ శ్రీనాథ్, సంఘం డైరెక్టర్లు శ్రీను, సతీష్, శ్రీనివాస్, రాజు, రజనీకాంత్, గ్రామ ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామీణ దుకాణం ప్రారంభం



**ధర్మసాగర్, ఫిబ్రవరి27 (ప్రజాజ్యోతి)** వేలేరు మండల కేంద్రంలో నాబార్డ్, డీఆర్డీఏ శాఖల సహకారంతో మండల మహిళా సమైక్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుకాణాన్ని నా బార్డ్ డీడీఎం చంద్రశేఖర్, వేలేరు సర్పంచ్, వేలేరు మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు బిల్లా యాదగిరి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాబార్డ్ డీడీఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ మహిళలు స్వయంగా తయారు చేసిన పలు ఉత్పత్తులను విక్రయించేందుకు గ్రామ దుకాణాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు గ్రామీణ ఉత్పత్తులైన హస్తకళలు, చేనేత బ్యాగులు, దుస్తుల తయారీ, గ్రామీణ దుకాణాల ద్వారా విక్రయించుకునే సదుపాయం కల్పించారు. నా బార్డ్ డీడీఎం చంద్రశేఖర్ కు వేలేరు సర్పంచ్ యాదగిరి గ్రామంలో కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసి మహిళలను ప్రోత్సహించాల్సిందిగా కోరారు. నాబార్డ్ సహాయంతో గ్రామానికి అభివృద్ధి పనులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ డీపీఎం రాజేంద్ర ప్రసాద్, కత్తి సంపత్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఏపీఎం అనిత, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు రేణుక, ఉప సర్పంచ్ శ్రీకర్, వారు సభ్యులు సునీల్ ప్రశాంత్ మహిలా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సృజనాత్మకతకు వేదికగా సైన్స్ ఫెయిర్

- ల్యాదళ్ల లోని 'వికాస్ హై స్కూల్' లో సైన్స్ ఫెయిర్







**దామెర, ఫిబ్రవరి 27 (ప్రజాజ్యోతి ):** విద్యార్థుల సృజనాత్మకతకు వేదికగా సైన్స్ ఫెయిర్ దోహదం చేస్తుందని డిస్ట్రిక్ట్ సైన్స్ అధికారి శ్రీనివాసస్వామి తెలిపారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా దామెర మండలం ల్యాదళ్ల లోని 'వికాస్ హై స్కూల్' లో సైన్స్ ఫెయిర్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు సస్టైనబుల్ సిటీ, చంద్రయాన్, ఆంటీ తెఫ్ట్ మెషిన్, విండ్ మిల్, రోబో టీచర్, ఫ్యూచర్ ఎలవేటెడ్ టీస్పోర్ట్, స్మార్ట్ ఫార్మింగ్, రివర్ వాటర్ క్లీనింగ్ వంటి అంశాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా డీఎస్ఓ శ్రీనివాస్ స్వామి, ఎంఈఓ రాజేష్ కుమార్, సర్పంచ్ బొంకూరి రవి యాదవ్, ట్రస్మా ప్రెసిడెంట్ సతీష్ కుమార్, రిటైర్డ్ ఎస్ ఐ యాసిర్ ఎస్వీబీ స్కూల్ డైరెక్టర్ ప్రిన్సిపాల్ జి రమేష్‌హాజరై సైన్స్ ఫెయిర్ లో ప్రదర్శించిన అంశాలను విద్యార్థులు నుండి అడిగి తెలుసుకున్నారు. ముందుగా ఉపాధ్యాయులు యశ్వంత్ రచించిన 'మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే' బుక్కును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వికాస్ హై స్కూల్ డైరెక్టర్, ప్రిన్సిపాల్ ఎండి అక్బర్, ఉపాధ్యాయులు ఎండి యాకుబ్ పాషా, శ్రీజ, సుధాకర్, ఆసియా సుల్తానా, సిహెచ్ ప్రసాద్, యశ్వంత్, సతీష్, రవికుమార్, వెంకట్, దామెర ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఎస్వీబీ పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# చెల్పూర్ కేటీపీపీ లో జై భీం డైరీ 2026 క్యాలెండర్ ఆవిష్కరణ



**గణపురం ప్రజాజ్యోతి ఫిబ్రవరి27** గణపురం మండలంలోని చెల్పూర్ కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ (కేటీపీపీ )లో జై భీం డైరీ 2026 క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీపీపీ చీఫ్ ఇంజనీర్ చిట్టాప్రగడ శ్రీ ప్రకాష్‌గారి చేతుల మీదుగా తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ , ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జై భీం డైరీ 2026 క్యాలెండర్ ఆవిష్కరించారు వ్యవస్థాపకులు, సెక్రటరీ జనరల్ మాతంగి శ్రీనివాస్ ఆదేశాలతో కేటీపీపీ రీజినల్ ప్రధాన కార్యదర్శి బొమ్మకంటి రాజేందర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం సూపరింటెండింగ్ ఇంజనీర్ (అడ్మిన్) మురళి మోహన్ కి జై భీం డైరీ క్యాలెండర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కేటీపీపీ రీజినల్ కమిటీ సభ్యులు అల్లూరి సంపత్, అజ్మీర జయరాం, సింగారపు సురేష్, బెజ్జల రాజేందర్, గుర్రం నర్సయ్య, బీరెల్లి కొమురయ్య, జర్పుల సమ్మయ్య పాల్గొన్నారు. అలాగే మహిళా సభ్యులు ఎ. నిహారిక, గౌతమి కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ నారాయణ హై స్కూల్‌లో ఎస్ఎల్‌సీ కార్యక్రమం



**గణపురం ప్రజాజ్యోతి ఫిబ్రవరి27** గణపురం మండల కేంద్రంలోని శ్రీ నారాయణ హై స్కూల్ లో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ ఎస్ ఎల్ సి కార్యక్రమం కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈకార్యక్రమంలో విద్యార్థులు తమ విద్యా ప్రగతిని తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమక్షంలో వివరిస్తూ తమ ప్రతిభను ప్రదర్శించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్కూల్ చైర్మన్ నాగనబోయిన రవి మాట్లాడుతూ ఎస్ ఎల్ సి కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు బాధ్యతాభావాన్ని పెంచుతుందని విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకుని ముందుకు సాగేందుకు ఇది ఒక ఉత్తమ వేదిక” అని తెలిపారు. సమగ్ర అభివృద్ధికి దోహద పడుతుందన్నారు కరెస్పాండెంట్ పోతుగంటి శశిధరచారి మాట్లాడుతూ ఎస్ ఎల్ సి కార్యక్రమం విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమన్వయంతో విద్యార్థులు మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని అన్నారు. ప్రిన్సిపాల్ స్వప్న చారి కార్యక్రమాన్ని సమన్వయం చేసి విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# శ్రీ గట్టు మల్లన్న స్వామి దేవాలయం లో హుండీ లెక్కింపు



**ధర్మసాగర్, ఫిబ్రవరి27(ప్రజా జ్యోతి)** హనుమకొండ జిల్లా వేలేరు మండలంలోని మల్లికుదుర్ల గ్రామ శివారులో ఉన్న శ్రీ గట్టు మల్లన్న స్వామి దేవాలయం లో హుండీ లెక్కింపు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆలయ అధికారుల సమక్షంలో భక్తుల సమర్పించిన కానుకలను లెక్కించి ఆదాయ వివరాలను ప్రకటించారు. దేవాలయ ఆదాయ వివరాలు (20-01-2026 నుండి 27-02-2026 వరకు – 38 రోజులు) హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలు 1,96,599 రూపాయలు టికెట్ల రూపంలో వసూలైన ఆదాయం 5,64,174 రూపాయలు, మొత్తం ఆదాయం 7,60,773 రూపాయలు ఈ 38 రోజుల వ్యవధిలోనే ఆలయానికి లక్షల రూపాయల ఆదాయం రావడం భక్తుల విశ్వాసానికి నిదర్శనమని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. దేవాలయ అభివృద్ధి కార్యక్రమాలు, పూజా నిర్వహణ, సదుపాయాల మెరుగుదల కోసం ఈ నిధులను వినియోగించనున్నట్లు వారు వెల్లడించారు. భక్తుల విశ్వాసం, ఆధ్యాత్మిక చైతన్యం మరింతగా పెరుగుతూ ఉండటం విశేషంగా నిలిచింది.